28022025-MAI-04_Layout 1 2/28/2025 3:30 AM Page 1

నమస్తే తెలంగాణ

దక్షిణాది మెడపై పునర్విభజన కత్తి

మంచి పని చేసినవారిని మెచ్చుకుంటాం, సన్మానిస్తాం, బహుమతులిస్తాం. కానీ, శిక్షించడం జరిగితే? దేశ భవితవ్యం కోసం జనాభా తగ్గించాలని ఐదు దశాబ్దాల కిందట కేంద్రం పిలుపునిచ్చింది. పెరుగుతున్న జీవన వ్యయం, వనరుల పరిమితి దృష్ట్యా అది అనివార్యమని తేల్చిచెప్పింది. అభివృద్ధిలో, చదువులో ఉత్తరాది కన్నా ముందంజలో ఉన్న దక్షిణాది దానిని తు.చ. తప్పక పాటించింది. జనాభాను నియంత్రణలో ఉంచింది. కానీ, అన్నింటా వెనుకబాటుతనంలో ఉండిపోయిన ఉత్తరాది చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అనే నినాదాన్ని ఒంట బట్టించుకోలేకపోయింది. దాంతో అక్కడ జనాభా ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. ఇప్పుడు జనాభా ప్రాతిపదికన పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన పేరిట కేంద్రం ఉత్తరాదికి, ముఖ్యంగా యూపీ, బీహార్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం, అంటే సీట్లు పెంచబోతున్నది. దేశ అభ్యున్నతికి పాటుపడిన దక్షిణాదికి దండన, తోడ్పడని ఉత్తరాదికి అధిక ప్రాతినిధ్యపు సత్కారం కల్పించబోతున్న దన్న మాట. ఇది సుదీర్ఘ పర్యవసానాలకు దారితీస్తుందనేది తెలిసిందే. 'దక్షణాది మెడ మీద పునర్విభజన కత్తి వేలాడుతున్నది' అని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన హెచ్చరిక ఈ పరిణామం గురించే. గతంలోనూ ఇదే వ్యవహారంపై ఆయన 'తమిళనాడుకు చెందిన ఒక్కో జంట 16 మంది పిల్లల్ని కనాలని' వ్యంగ్యంగా పిలుపునిచ్చారు.

స్టాలిన్ తాజా ప్రకటన మరోసారి ఉత్తర, దక్షిణ తారతమ్యాల చర్చకు తెరలేపింది. నియోజకవర్గాల పునర్విభజనలో తమిళనాడుకు జరగబోయే నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయన ఆ మాట అన్నప్పటికీ మొత్తంగా నాలుగు దక్షిణ రాష్ట్రాలకు అది వర్తిస్తుంది. 'మేమిద్దరం మాకిద్దరు' అనే సూత్రం చాలావరకు పాటించి దేశ జనాభా నియంత్రణకు దన్నుగా నిలిచిన దక్షిణాదికి ఒరిగిందేమిటి? జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరుగుతుండటంతో ఉత్తరాదిలో లోక్‌సభ స్థానాల సంఖ్య భారీగా పెరుగుతుంది. అదే సమయంలో దక్షిణాదికి అరకొరగా మాత్రమే సీట్లు పెరుగుతాయి. దీని ఫలితంగా పార్లమెంటులో నిర్ణాయక పాత్ర పోషించే అవకాశాన్ని దక్షిణాది కోల్పోతుండటం అసలు కీలకం. అప్పటికి భారత్ జనాభా 142 కోట్లు అవుతుందని భావిస్తున్న 2026లోనే పునర్విభజన జరుగుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంటున్నారు. దక్షిణాదికి కూడా సీట్లు పెరుగుతాయని ఆయన అంటున్నారు. అయితే, ఇది కంటితుడుపు మాటే. ఎందుకంటే ఈ పెరుగుదల అంతటా ఒకే తీరుగా ఉండదు. పునర్విభజన కసరత్తు ఫలితంగా మొత్తం స్థానాల సంఖ్య 543 నుంచి 848కు పెరుగుతుంది. జన సంఖ్యను బట్టే పునర్విభజన ద్వారా నియోజకవర్గాలను పెంచుతారు. గరిష్ఠంగా లబ్ధి పొందనున్న యూపీలో ప్రస్తుతం 80 స్థానాలుంటే అవి 143కు పెరుగుతాయి. 50 శాతం పైగా స్థానాలు వచ్చిచేరుతాయి. బీహార్ స్థానాలు 40 నుంచి 79కి, అంటే దాదాపు రెట్టింపు పెరుగుతాయి. అదే తమిళనాడులో 39 కాస్తా 49 అవుతాయి. ఇక తెలంగాణలోని 17 స్థానాలు 23కు, ఏపీలోని 25 స్థానాలు 31కి పెరుగుతాయి. దక్షిణాదిలో ఎక్కువగా పెరిగే కర్ణాటకలో స్థానాల సంఖ్య 28 నుంచి 41 అవుతుంది. కేరళ లోక్‌సభ స్థానాలు యథాతథంగా 20 వద్దే ఉంటాయి.

పైన తెలిపిన కారణాల వల్ల దక్షిణాది రాష్ట్రాలు పునర్విభజనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. 'జనాభా నియంత్రణను పటిష్ఠంగా అమలు చేసినందుకు మా రాష్ట్రాన్ని శిక్షిస్తారా?' అని తమిళనాడుతో పాటుగా దక్షిణాది రాష్ట్రాలన్నీ మొదటినుంచీ ప్రతిఘటిస్తున్నాయి. తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటనకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంఘీభావం తెలుపడం గమనార్హం. జనాభా ప్రాతిపదికన పునర్విభజన వద్దని ఆయన అంటున్నారు. ఉత్తర, దక్షిణ విభేదాలకు కారణమయ్యే అంశాలు ఇంకా చాలానే ఉన్నాయి. అందులో కీలకమైంది జీడీపీ, పన్ను వాటాల వ్యత్యాసం. అంతిమంగా ఇదంతా సమాఖ్యవాదానికి పెనుసవాలుగా మారబోతున్నది. ఆ సంగతి అలా ఉంచితే ఇప్పటిదాకా నాలుగుసార్లు పునర్విభజన కమిషన్లు ఏర్పాటైనా ఏమీ జరుగలేదు. అయితే ఈసారి ఎలాగైనా సాధించి తీరాలనే పట్టుదలతో కేంద్ర పాలకపక్షమైన బీజేపీ దూకుడుగా పోతున్నది. ఉత్తరాదిలో బాగా విస్తరించి దక్షిణాదిలో పట్టు సాధించేందుకు తంటాలు పడుతున్న ఆ పార్టీకి పునర్విభజన లెక్కలు సానుకూలంగా ఉన్నాయనేది గమనార్హం. అయితే దక్షిణాది ప్రాతినిధ్యం తరుగుదల సమస్యను పరిష్కరిస్తామని కేంద్రం చెప్తున్నది. అదెలా? అనేది మాత్రం ఇప్పటిదాకా స్పష్టత రాలేదు. ■

పర్రెల్లో పుర్రెలు దూర్చినోళ్లేరి?

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

తెలంగాణ బాపు జన్మదినం.. అయ్య కడుపు సల్లగుండాలని కోటి దీవెనలతో జనం ఎర్రవల్లి బాట పట్టారు. వాళ్లలో నేనూ కలిసిపోయాను. మహా స్వాప్నికుని ఆత్మీయ స్పర్శ కోసం ఇంటి ముందర గుంపులు గుంపులుగా జన సందోహం. కాలు కదప సందు కాలేదు. సారును కలవలేక పోయిన. కానీ జనం మధ్యకే కేసీఆర్ వచ్చి మాట్లాడారు. 'తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలను చైతన్య పరుస్తూ, తెలంగాణ అస్తిత్వ పటిష్టతకు కృషిచేస్తూ, గత గాయాల నుంచి కోలుకున్న తెలంగాణను తిరిగి అవే కష్టాలపాలు కాకుండా, దోపిడీ వలసవాదుల బారిన పడకుండా తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయం అందించే దిశగా మనం కృషి చేయాలి' అని ప్రజలకు పిలుపునివ్వడం విని ఆశ్చర్యపోయాను.

తాను తపన పడిన ఈ తెలంగాణ సమాజమే బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించింది. కానీ, ఆయన ప్రతి మాటలో తెలంగాణ జీవనయానాన్ని వికసింపజేయాలనే తపన, విధ్వంసమైపోతున్న వ్యవస్థలను తిరిగి వింగడింపు చేయాలనే ఆలోచన, ఆవేదన తప్ప ఇసుమంతైనా రాజ్యకాంక్ష వ్యక్తపరచని నిగ్రహం, నైతిక సంఘర్షణను, రాజకీయ ఆపేక్షను వేరు పరిచి చూసిన నిర్గుణ స్వరూపం నా కండ్ల ముందు సాక్షాత్కరిస్తుంటే, జనం మధ్యలోంచే రెండు చేతులెత్తి దండం పెట్టి వెనుదిరిగిన.

రెండు రోజులు ఆగి ఈ దృగ్విషయానికి అక్షర రూపం ఇచ్చేందుకు కూర్చున్న. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లోని ప్రతి అనుభవానికి అక్షరాలను ఏరుకొని పదాలుగా పొందించి, వ్యాసరూప అక్షర మాలగా గుదిగుచ్చే పనిలో నిమగ్నమైపోయాను. 'నల్లమలలోని దోమలపెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్..' అనే పదాలు టీవీలో వినిపిస్తుంటే తల పైకెత్తి చూసిన. నల్లమలతో నాది భావోద్వేగమైన అనుబంధం. అక్కడి చెంచులతో కలిసి అడవంతా కలెదిరిగి, కృష్ణమ్మ ఒడిలో సేద తీరిన మధుర జ్ఞాపకాలు అనేకం. అందుకే నల్లమల అనే పేరు ఏ స్వరంలో పలికినా.. ఆ నాదును నా మనసు పట్టేస్తుంది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిందని బ్రేకింగ్ న్యూస్ హెడ్‌లైన్‌గా పడుతున్నది. అన్ని టీవీల్లోనూ అదే వార్త. మనసు కలవరపడ్డది. కొద్దిసేపటికే హృదయ విదారక దృశ్యాలు టీవీ స్క్రీన్ల మీద ప్రత్యక్ష ప్రసారమవుతున్నాయి. మనసు కకావికలమైంది. పేగులు మెలిపెడుతున్నయి. పెన్ను ముందుకు కదలడం లేదు. నాలుగు పొద్దుల నుంచీ ఇదే తంతు. టన్నెల్ 14వ కిలోమీటర్ దాటిన తరువాత దోమలపెంట వద్ద సొరంగం 140 మీటర్ల పొడవున, నాలుగైదు మీటర్ల మేర పైకప్పు కుప్పకూలిందట. గాలి కూడ చొరబడని మృత్యు కుహరంలో 8 మంది కార్మికులు ప్రాణాలతో పోరాడుతున్నారట. రెస్క్యూ బృందాలు పగలు రేయి శ్రమిస్తున్నాయట. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో కథనాలు కథలు కథలుగా ప్రసారమవుతున్నాయి.

అందులోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు మీద కేసీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్ ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. 2016లో అసెంబ్లీలో కేసీఆర్ సభకు వివరిస్తున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అది. ''ప్రపంచంలోనే లాంగెస్టు టన్నెల్ అధ్యక్షా. 43 కిలోమీటర్ల పొడవు. 1960 యాజిటేషన్ తరువాత మాకు నీళ్లు ఇయ్యాలే అని అడిగితే.. చర్చలు అధ్యక్షా.. చర్చోప చర్చలు. తెలంగాణ సమస్యలను ముందుపడనియ్యరు, తెమలనియ్యరు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మళ్లొక్కసారి చర్చలు పెడితే ఇది కాల్వనా? లిఫ్టా? సొరంగమా? అని చర్చ అధ్యక్షా.. ఆఖరికి టైగర్ వ్యాలీ కింద నుంచి టన్నెల్ బోర్ మిషన్ అని పెట్టించ్రి. అది ముందుకు పోదు వెనక్కి రాదు. శ్రీశైలం నిండినప్పుడల్లా టన్నెల్‌లోకి నీళ్లు వచ్చి మునిగిపోతున్నది. మళ్లీ వాటిని క్లియర్ చేయాల్సి వస్తున్నది. టైగర్‌వ్యాలీ కాబట్టి అడవిలోకి జనాలు వెళ్లొద్దు. వెళ్తే అభ్యంతరాలుంటయి. మళ్లీ పీళ్లే కోర్టుకెక్కుతారు. పర్యావరణ సంఘాలు వస్తాయి. ఇది పర్యావరణ వ్యతిరేకమంటయి''.. అని ప్రజెంటేషన్ ఇస్తున్నారు. ఆయన మాటలు వినసొంపుగా, ప్రొఫెసర్ పాఠం చెప్పినట్టు, అమ్మలక్కలు తీరువాటుగ కూసొని ముచ్చట పెట్టినట్టు చెప్పున్నారు. టన్నెల్‌లోకి గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేద్దామంటే కూడా వీలు లేదు అధ్యక్షా.. రెండు చివర్ల నుంచి మిషన్లు పెట్టి గాలి వదిలితే, ఆ గాలి పీల్చుకుంటూనే లోపల కార్మికులు సొరంగం తవ్వాలి. ముందు డ్రిల్లింగ్ చేసుకుంటూ వెనుక నుంచి లైనింగ్ చేసుకుంటూ వెళ్తుంది. వెనక్కి లాగుదామంటే లాగలేం. ఒక వేళ లాగాలంటే వెనుక చేసిన లైనింగ్ అంతా కూల్చేయాల్సిందే. ఇప్పుడు దాన్ని బలవంతంగా కొనసాగించడం తప్ప గత్యంతరం లేని భయంకరమైన పరిస్థితిలో కూరుకుపోయిన ప్రాజెక్టు ఎస్ఎల్‌బీసీ.. ఇలా ఎవరైనా పెడతారా అధ్యక్షా! నీళ్లు ఇచ్చే విధానం ఇదేనా? ఎస్ఎల్‌బీసీ గురించి ఎప్పటి నుంచి వింటున్నాం.. ఇంకెన్ని ఏండ్లకు కంప్లీట్ కావాలి.. ఇది ఎవరి పాపం.. తెలంగాణ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి' అంటూ కేసీఆర్ మథనపడుతున్న క్లిప్పింగ్ వైరల్ అవుతున్నది. కేసీఆర్‌కు జలప్రాజెక్టు మీద ఉన్న సంపూర్ణమైన పరిజ్ఞానం, ముందుచూపునకు ఇది నిదర్శనం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి శ్రీశైలం, నాగార్జునసాగర్ కాకుండా కృష్ణా, పెన్నా నదుల మీద కలిసి ఆంధ్రాలో 650 టీఎంసీల నీటి నిల్వ రిజర్వాయర్లు ఉన్నయి. అదే తెలంగాణలో కృష్ణా నది మీద 20 టీఎంసీలకు మించి రిజర్వాయర్లు లేవు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జల యజ్ఞం కింద ప్రారంభించిన కృష్ణా బేసిన్‌లోని

కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్టులు పెండింగ్ ప్రాజెక్టులుగా దుమ్ము పేరుకుపోయాయి. కేసీఆర్ కొలువు కూటాల మీదికి వచ్చాక ఎస్ఎల్‌బీసీకి 40 టీఎంసీలు, కల్వకుర్తి ప్రాజెక్టుకు 40 టీఎంసీలు, భీమాకు 20 టీఎంసీలు, నెట్టెంపాడుకు 25 టీఎంసీలు మొత్తం 125 టీఎంసీల జలాలు తక్షణ వినియోగం కోసం పట్టుబట్టారు. కేసీఆర్ కేంద్రంతో కొట్లాడి నీటి వినియోగానికి అనుమతులు సాధించారు.

అప్పటి నీళ్ల మంత్రి హరీశ్‌రావును పురమాయిస్తే, ఆయన కాళ్లకు చక్రాలు కట్టుకొని కాళేశ్వరం-కల్వకుర్తి మధ్య తిరిగి రన్నింగ్ ప్రాజెక్టులుగా మలిచారు. రోజుకు 1,600 క్యూసెక్కుల నీళ్ల చొప్పున కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాల్లో 3 లక్షల ఎకరాలకు నీళ్లందినయి. నెట్టెంపాడు ద్వారా 1.2 లక్షలు, భీమా ద్వారా 1.4 లక్షల ఎకరాలు, కోయిల్ సాగర్ ద్వారా 8 వేల ఎకరాలు కొత్త ఆయకట్టుకు నీరు పారింది. బీడువడ్డ నేల ఆకుపచ్చ తెలంగాణగా పునరుజ్జీవం పోసుకున్నది.

కొత్త కాపురం చేసేటోనికి సొంత తెలివైనా ఉండాలె. లేదంటే అనుభవజ్ఞుడు చెప్పిన మాటైనా వినాలె. అటూఇటూ కాని కొసెర్రోని తోనే కొంపలు కూలుతయని పల్లెల్లో ఇప్పటికీ ఓ మోటు నానుడి ఉన్నది. హైదరాబాద్ చుట్టూ మూడు సముద్రాలున్నయని, బంగాళాఖాతం, అరేబియా సముద్రం అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన నాడే ఆయనకు నీటి వనరుల మీదున్న అవగాహన రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయింది. తనకు ఎలాగూ తెలియదు కాబట్టి, నిఖార్సయిన తెలంగాణ అభివృద్ధి ప్రదాత కేసీఆర్ సలహాలు, సూచనలైనా తీసుకోవాలి కదా, అదీ లేదు. నాలుగేండ్ల నుంచి పడావుపడిన ప్రాజెక్టులోనికి ఎకాఎకిన కార్మికులను సొర్రగొడితివి. ఎనకాముందు ఆలోచన లేకుండా పట్టుర పట్టు అని బోరింగ్ మిషన్‌ను ఆన్‌చేయ్తే, దాని డ్రిల్లింగ్ అదురుకు పైకప్పు కూలిపోయిందని నిపుణులు చెప్తున్నారు. అది పోతే పోయింది. కార్మికులు చిక్కుకోవడమే హృదయ విదారకం.

ఇక్కడో సంఘటన గుర్తు చేయాలి. కాళేశ్వరం కాడి పర్రెల పంచాయితీ ప్రతి రైతన్నకు అనుభవమే. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నదీ గర్భాశయ జలాశయాలు. 16 భూ ఉపరితల జల భాండాగారాలు. 228 పిల్లర్లు.. 20 లిఫ్టులు.. 21 బాహుబలి పంపులు.. 21 సంపుహౌజ్‌లు.. 203 కిలోమీటర్ల సొరంగాలు.. 1,531 కిలోమీటర్ల కాల్వల సమాహారాన్ని నేర్పుగా కూడగట్టి కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపం ఇచ్చిన ఆధునిక జల ప్రదాత కేసీఆర్. కాల గమనంలో మేడిగడ్డ కింద రెండు పిల్లర్లు పర్రెలు బాసిన సంగతి తెలంగాణ రైతాంగానికి విదితమే. ఒక వాయి మంత్రుల బృందం, మరో వాయి ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డకు వెళ్లి పర్రెల్లో పుర్రెలు దూర్చి ఎగాదిగా చూసి వచ్చారు. పర్రెల పంచాయితీనే ముందుపెట్టి ఏకంగా కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టించ్రి. కేసీఆర్ వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేందుకు ఎంక్వైరీ కమిషన్ వేశారు. అక్కడ ఏమీ లేకున్నా నానాయాగీ చేస్తున్నరు. కానీ ఇవాళ ఎస్ఎల్‌బీసీ కూలిపోయింది. పాలకుని అవగాహన రాహిత్యంతో పని మొదలు పెట్టి వారం తిరక్క ముందే సొరంగం కుప్పకూలింది. ఇవ్వాల్టికి ఐదు దినాల పొద్దు. 8 మంది ప్రాణాలు సొరంగంలో కొట్టుమిట్టాడుతున్నయి. ఈ వ్యాసం రాసే సమయానికి ముఖ్యమంత్రికి ఇవేమి పట్టనట్టు గుళ్లు, ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నరు. ఇప్పటి వరకు సంఘటనా స్థలానికి వెళ్లలేదు. రెస్క్యూ టీం అధికారులను వెన్నుతట్టి ప్రోత్సహించలేదు. బాధిత కుటుంబాలకు నేనున్నాననే భరోసా ఇవ్వలేదు. ఇక్కడ విషాద ఘోషలు మిన్నుట్టుతుంటే అక్కడ ఆకాశ వీధుల్లో విహార యాత్రలతో గడుపుతారా? ఇదా.. పరిపాలకునికి ఉండే తరీఖా.

అటు మేడిగడ్డ మీద, ఇటు ఎస్ఎల్‌బీసీ మీద జనానికి అనుమానాలున్నయి. నూరు కుట్రలు, పంద అబద్ధాలు కలగలిస్తే ఆ పెద్ద మనిషి అంటరు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరును దత్తత తీసుకున్నడు. ఇంకుడు గుంతలను మించిన అభివృద్ధే లేదని, ఇంటికో గుంతతోడి పాలమూరు జనకాంక్షను ఇంకుడు గుంతల్లోనే బొందపెట్టిన ఘనుడు. అంతకు తగ్గ బొంత ఈయనే అంటరు. గురుదక్షిణ కింద తెలంగాణ ప్రాజెక్టులను బొంద పెడుతున్నరనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విపరీతం మీద విచారణ చేయమని మాజీ నీళ్ల మంత్రి హరీశ్‌రావు అడుగుతున్నరు.

కండ్ల ముందు జరుగుతున్న దారుణాలు ఓపు కోలేక గుండెలు మండుతున్నయి. పర్‌తం మల్లయ్య గుడికెళ్లి ఇట్టెందుకు చేశావని నిలదీయాలని ఉంది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిట్టనిలువునా కుప్ప కూలినందుకు కాదు. సొరంగంలో 8 నిండు ప్రాణాలు విషాద వదనంతో ఘోషిస్తున్నాయనీ కాదు, మూడు దశాబ్దాల ఎస్ఎల్‌బీసీ టన్నెల్ మోసానికి కారకులెవరని? సొరంగంలోనే నల్లగొండ ఫ్లోరైడ్ బాధితుల ఆశలు సమాధి చేసిన పాపాత్ముడు ఏడని? పాలమూరు, నల్లగొండను ఎండబెట్టి కృష్ణా జలాలను ఆంధ్రోళ్లకు సద్దికడుతున్నది ఎందుకని?

పంతానికి పోయి 8 మందిని మృత్యుకుహరంలోకి నెట్టిన పాపం మూట కట్టుకున్నది ఎవరని? పోతిరెడ్డిపాడుకు పొక్కలు కొట్టి ఈ ఒక్క ఏడాదిలోనే 220 టీఎంసీల నీళ్లు ఎత్తుకపోతుంటే కండ్లు మూసుకున్న ధృతరాష్ట్ర పాలన ఏమిటని అడగాలని ఉన్నది. ఆనాటి రోజులు మళ్లీ వస్తాయంటే ముందు వెనుక ఆలోచన లేకుండా ఓటు పక్కకు తిప్పి ఒక్క తప్పిదం చేసినందుకు ఎంతపని చేస్తివిరా సాంబశివా! అని అడగాలని ఉన్నది. ■

అరువుకు తెచ్చిన కరువు

రాజా వరప్రసాద్ వనారస

'కరువు వస్తే కొందరికి పండగే..' ఓ ప్రముఖ జర్నలిస్టు, రచయిత రాసిన పుస్తకంలోని వ్యాఖ్య ఇది. నాడు ఉమ్మడి ఏపీలో టీడీపీ, కాంగ్రెస్‌ల పాలనలో నెలకొన్న పరిస్థితులను చూసి ఆయన ఈ మాట చెప్పారు. రెండు దశాబ్దాల కిందట ఆయన చెప్పిన మాట తెలంగాణలో కాంగ్రెస్ హయాంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులకు సరిగ్గా సరిపోతుంది.

కరువు నిధుల కోసమే హస్తం పాలకులు కరువును అరువు తెచ్చారు. రాష్ట్రంలో జలాశయాలు నిండుకున్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, నీళ్లుంటేనే సాగు చేయాలని స్వయంగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి చెప్పడమే అందుకు నిదర్శనం. 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తనతో పాటు కరువును కూడా వెంట తీసుకొచ్చింది. కాంగ్రెస్ హస్తవాసిలో తెలంగాణ పూర్తిగా మారిపోయింది. ఇంకా చెప్పాలంటే ఆ పార్టీ అధికారంలోకి రానున్నదని తెలంగాణ ప్రజల కంటే ముందే ప్రకృతి పసిగట్టినట్టుంది. అందుకే ఆ పార్టీ వచ్చిరాగానే 2023 వానకాలంలో చివరి దశలో సాగుచేసిన పంటలు ఎండిపోయాయి. ఆ తర్వాత 2024 యాసంగిలో అసలు సాగే ముందుకు సాగలేదు. పదేండ్ల పాటు పాడి పంటలతో కళకళలాడిన తెలంగాణ ఒక్క ఏడాదిలోనే కరువు ముంగిట నిలిచింది.

ఈ సారి వానకాలంలో గతానికి భిన్నంగా భారీ వర్షాలు కురిశాయి. వరదలు పోటెత్తాయి. రాష్ట్రంలోని చిన్నాచితక ప్రాజెక్టులు మొదలుకొని నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల వంటి జలాశయాలన్నీ నిండాయి. కుంటలు అలుగు పోశాయి. చెరువులు మత్తడి దుంకాయి. రాష్ట్రంలోని కృష్ణా నదిపై ఉన్న ప్రధాన ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారడంతో గేట్లను ఎత్తి సుమారు నెల రోజులపాటు నీళ్లను కిందికి వదిలారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా లక్షల కొద్దీ క్యూసెక్కుల గోదావరి జలాలు సముద్రం పాలయ్యాయి. కానీ, కేసీఆర్‌పై ఉన్న అక్కసుతో బుర్ర లేని కాంగ్రెస్ సర్కార్ పర్రెలను సాకుగా చూపి కాళేశ్వరం ప్రాజెక్టును పండబెట్టి చెరువులను ఎండబెట్టింది. ఫలితంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా కరువు చాయలు అలుముకున్నాయి.

వాస్తవానికి కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదు. మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంప్ హౌస్‌లు, 19 సబ్ స్టేషన్లు, 200 కిలోమీటర్ల టన్నెళ్లు, 1500 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 140 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు, ఏటా 240 టీఎంసీల నీటిని ఎత్తిపోసే వ్యవస్థ కాళేశ్వరం. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ కూడా అందులో భాగమే. కుంగిన పిల్లర్లతో సంబంధం లేకుండా నీళ్లను లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపి పొలాలకు నీళ్లు పారించవచ్చు. కానీ, రేవంత్‌రెడ్డి సర్కార్ ఆ పని చేయలేదు. అలా చేస్తే తాము గతంలో కాళేశ్వరంపై చేసిన ఆరోపణలు అసత్య ప్రచారమని ప్రజలకు తెలిసిపోతుందని వారు భావించారు. అందుకే, నీళ్లను లిఫ్ట్ చేయలేదు. రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన నిర్వాకం వల్ల ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు నిండుకున్నాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. వాగులు, వంకల్లో రాళ్లు తేలుతున్నాయి. బావులు, బోర్లు నీళ్లు పోయక పంటలు ఎండిపోతున్నాయి. పదేండ్ల కిందట సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, చివ్వెంల తదితర ప్రాంతాల్లో నీళ్లు లేక కంది, వేరుశనగ పండించేవారు. ఎక్కడో 250 కిలోమీటర్ల దూరంలోని కాళేశ్వరం జలాలు లింగమంతుల స్వామి పాదాలను తడపడంతో గత పదేండ్లపాటు ఆ ప్రాంతాల్లో ఎక్కడచూసినా ధాన్యం రాశులు దర్శనమిచ్చాయి. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో నీళ్లు లేక ఆ ప్రాంతాలు మళ్లీ బీడు వారుతున్నాయి.

కృష్ణా నది పరీవాహక ప్రాంతాల పరిస్థితి మరోలా ఉన్నది. ప్రాజెక్టులోని నీళ్లను ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణగా రేవంత్ రెడ్డి అప్పనంగా అప్పగించడంతో ఇప్పుడు తెలంగాణ రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. నీళ్లుండి కూడా సరిగ్గా వాడుకోలేని అసమర్థ పాలకుల పుణ్యమాని అన్నదాతలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరి పంటకు ఇంకా కనీసం రెండు నెలల పాటు నీళ్లు అవసరం. ఇప్పటికే రాష్ట్రంలో లక్ష ఎకరాల పంట ఎండిపోయింది. కండ్ల ముందే తమ కష్టం వృథా అవుతుండటంతో రైతులు చెమట చిందించి పొలం పారిస్తున్నారు. బోర్లు అంతంత మాత్రమే పోస్తున్న తరుణంలో కోతల కరెంటు కర్షకులకు శాపంగా మారింది. ఈ నేపథ్యంలో కనీసం తిండి గింజల పంట చేతికందుతుందో లేదా అస్తవ్యస్తం అవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సంపద సృష్టి గురించి ఏ మాత్రం అవగాహన లేని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి రాష్ట్రంలో నిధులకు కట కట ఏర్పడింది. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ సమావేశంలో అధికార పార్టీ నేతలే స్వయంగా ఈ విషయం చెప్పారు. సంక్షేమ పథకాలకు నిధుల్లేవు, అభివృద్ధి పనులు జరగడం లేదు, ఏ మొహం పెట్టుకొని గ్రామాల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యేలు తమ బాధను వెళ్లగక్కుతున్నారు. ఈ నేపథ్యంలో కావాలనే కరువును తీసుకొచ్చి, పంటలతోపాటు రైతుల డొక్కలు ఎండబెట్టి, కరువు నిధులను మెక్కాలని కాంగ్రెస్ పాలకులు కుయుక్తులు పన్నుతున్నారు.

(వ్యాసకర్త: రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్)

ఆకలి తీర్చేవాడు కావాలి

రాలిపోతున్న రైతులను
రక్షించే నేత కావాలి
అన్నం పెట్టి ఆకలి తీర్చే హాలికుని
ఆత్మహత్యలు ఆపే అధినేత రావాలి

సాధించుకున్న తెలంగాణలో
చచ్చిపోయే సంక్షేమాన్ని సంజీవంగా
సాగించే నేత కావాలి

ఎవుసం చేసి గిట్టుబాటు ధర లేక
మట్టి పువ్వులై మాడి రాలిపోతున్న
మల్లెలంటి రైతులకు మంచి చేసే
మంచి నాయకుడు కావాలి

కాపుదానం చేసి కాపురాలు కూలిపోతున్న
రైతుల కాపాడే వారే కావాలి
సేతానం చేసి చెడిపోయే రైతుల
చెదరకుండా చేసే ప్రభుత్వ కావాలి

భూమిని దున్ని
బువ్వ పెట్టేవాడు లేకుంటే
భూమి మీద మనిషి బువ్వ తినకుండా
సుద్దులు చెప్పగలడా

నాగలి పట్టి నేలను దున్ని సాలు తోలి
చెలకమట్టిలో చెమట చుక్కలు కారిసి
నాలుగు విత్తులు పండిస్తే నైవేద్యం పెట్టుకుంటున్నా

రాజుకైనా రాతి బొమ్మకైనా
ఆకలి తీర్చేవాడే హాలికుడు
కాపాడే వాడు కావాలి రావాలి

దేవరపాగ కృష్ణయ్య
9963449579

తిరోగమనంలో గురుకులాలు

సీవీవీ ప్రసాద్
80196 08475

'రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను రెండేండ్లలో పూర్తిచేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన రెసిడెన్షియల్ స్కూళ్ల సమీక్షా సమావేశంలో ప్రకటించారు. ఇది ఆహ్వానించదగిన పరిణామమే. కానీ, అంతకన్నా ముందు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న, ఇప్పటికే నడుస్తున్న గురుకుల విద్యాలయాలలో వసతుల అభివృద్ధికి, నాణ్యమైన విద్య, పరిఢవిల్లేలా ఆహారం అందించేందుకు గాను బడ్జెట్‌ను కేటాయించి గురుకులాలలో పునర్వైభవాన్ని తీసుకువస్తే బాగుంటుంది.

**1971,